


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 04-06-2024 సంపుటి : 06 సంచిక : 262 పేజీలు : 8 వెల : రూ 3-00

## నేటి ఫలితాలతో ఉత్కంఠకు తెర

**తేలనున్న ఎన్‌డిఎ పక్షాల బలాబలాలు**
**ఇండియా కూటిమి బలం ఎంతో వెల్లడి**
**దక్షిణాదిలో పెరగనున్న బిజెపి పట్టు**



న్యూఢిల్లీ,జూన్3: నేటి ఫలితాలతో ఉత్కంఠకు తెర పడనుంది. అలాగే ఎన్‌డిఎ పక్షాల బలాబలాలు తేలనున్నాయి. ఏ రాష్టరంలో ఎవరు బలంగా అవతరించారో కూడా తేలనుంది. ఇండియా కూటిమి బలం ఎంతో కూడా వెల్లడి కానుంది. అలాగే కాంగ్రెస్ అసలు బలం కూడా వెల్లడి కానుంది. కాంగ్రెస్ నేతలుప్రియాంక,రాముల్‌ప్రచారాలు ఏమేరకు సీట్లు సంపాదించి పెట్టాయన్నది చూడాలి. దక్షిణాదిలో పెరగనున్న బిజెపి పట్టుసార్వత్రిక ఎన్నికల ఫలితాల ఉత్కంఠకు నేడు తెరపడనుంది. ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఎలావున్నా...మంగళవారం అసలు ఫలితాలు వెల్లడికానున్నాయి. ఎగ్జిట్ పోల్ అంచనాలు ప్రజానాడిని పూర్తిస్థాయిలో పసిగట్టాయా లేదా అన్నది కూడా తేలనుంది.ఎగ్జిట్ పోల్స్ ప్రకారం అన్ని సంస్థలు కేంద్రంలో భారతీయ జనతా పార్టీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఎన్‌డిఎ విజయం సాధిస్తుందని తేల్చి చెప్పాయి.అబ్ కీబార్‌చార్‌గా పార్ అన్న నినాదంతో 400 సీట్లు దాటి గెలుపొందాలని లక్ష్యంగా పెట్టుకున్న కమలదళం.. ఆ లక్ష్యాన్ని చేరుకుంటుందని ఓ రెండు సర్వే సంస్థలు అంచనా వేశాయి. 2019లో సొంతంగానే 303 సీట్లు సాధించి, కూటమిగా 352 సీట్ల సంఖ్యను చేరుకోగా..ఈసారి సగటున కూటమి 350 సీట్లు సాధిస్తుందని ఎగ్జిట్ పోల్ ఫలితాలసారాంశం.2019తోపోల్చితేమిత్రపక్షాల సంఖ్యను పెంచుకున్నప్పటికీ వాటిలో కొన్ని ప్రధాన పార్టీలు బలహీనంగా ఉండడం వల్ల అనుకున్న లక్ష్యం చేరుకోవడం కష్టసాధ్యంగా మారిందని అర్థమవుతోంది. ఫలితంగా 400 దాటాలన్న ఎన్డీయే కల నెరవేరేలా కనిపించడం లేదు. అయితే దక్షిణాదిలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, తమిళనాడు, కర్నాటక, కేరళ నుంచి బిజెపికి ఎక్కువ సీట్లు రావచ్చని అంచనా వేస్తున్నారు. నితీష్ కుమార్, ఓంప్రకాష్ రాజ్‌భర్, ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ వంటి మిత్రపక్షాల నేతల ఈసారి ఎన్డీయేకు బలహీన మైన భాగస్వాములుగా మారారు. అన్నింటికి మించి ఎపిలో టిడిపి బలమైన నేస్తంగా అవతరిస్తోంది. తాజా అంచనలా ప్రకారం అక్కడ ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రావడమే గాకుండా బిజెపికి ఒకటి,రెండు పార్లమెంట్ సీట్లు వచ్చేలా ఉన్నాయి. అలాగే తెలంగాణలో కూడా గతంలో ఉన్న నాలుగు సీట్లు కనీసం 8కి చేరుకుంటాయని అంచనలు వేస్తున్నారు. ఎగ్జిట్ పోల్ ప్రకారం దేశంలోని 543 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండి కూటమికి 140 నుంచి 162 సీట్లు వస్తాయని దాదాపు అన్ని సర్వేలు అంచనా వేసాయి. ఎన్డీయేకు వచ్చే 346 సీట్లలో బీజేపీకి 311 సీట్లు, మిగిలిన మిత్రపక్షాలకు 35 సీట్లు వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన 2019 కంటే బీజేపీ సీట్ల సంఖ్య పెరగనుంది. ఇదికూడా దక్షిణాది నుంచే అని తెలుస్తోంది. ముఖ్యంగా బీహార్, మహారాష్ట్రల్లో ఎన్డీయేకు ఎదురుదెబ్బ తగిలిందని స్పష్టమవుతోంది. ఎగ్జిట్ పోల్ అంచనాల ప్రకారం ఎన్డీయేలోకి తిరిగొచ్చిన చంద్రబాబు నాయుడు సారథ్యంలోని తెలుగుదేశం పార్టీ, జయంత్ చౌదరి సారథ్యంలోని రాష్ట్రీయ లోక్‌దళ్, అనుప్రియా పటేల్ సారథ్యంలోని అప్నాదళ్ (ఎస్) మినహా మిగిలిన బీజేపీ మిత్రపక్షాల పనితీరు ఈసారి బలహీనంగా ఉంది. బీజేపీ నేతృత్వం లోని ఎన్డీఏ కూటమిలో మిత్రపక్షం ఏదైనా ప్రయోజనం కల్గిస్తుంది అంటే.. అది ఒక్క చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగు దేశం పార్టీయే అని సర్వే అంచనాలు చెబుతున్నాయి. ఎగ్జిట్ పోల్స్ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ఖాతా తెరుచుకునేలా కనిపిస్తోంది. రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల్లో తెలుగుదేశం 9, బీజేపీ 2, జనసేన 1 సీటు గెలుపొందుతాయని ఎగ్జిట్ పోల్ అంచనాలు చెబుతున్నాయి. ఈ విధంగా చూస్తే ఎన్డీయేకు మొత్తంగా 12 సీట్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 13 సీట్లు వస్తాయని తెలుస్తోంది. ఎగ్జిట్ పోల్స్‌లో దేశ వ్యాప్తంగా ఎన్‌డీఏలోని ఏ భాగస్వామ్య పార్టీ అయినా బీజేపీ తర్వాత అత్యుత్తమ పనితీరు కనబరిచింది అంటే అది తెలుగుదేశం పార్టీయే. ఆ తర్వాతి స్థానంలో 7 సీట్లతో జేడీ(యూ), 4 సీట్లతో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన నిలిచాయి.

## ఓట్ల లెక్కింపు ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా కె. శ్రీనివాసులు**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 03-సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా కె. శ్రీనివాసులు వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో మొదట పోస్టల్ బ్యాలెట్ ని లెక్కించడం జరుగుతుందని, అనంతరం 30 నిమిషాల తర్వాత ఈవీఎం కౌంటింగ్ మొదలవుతుందని కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు సహకరించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి ఎలక్షన్ కమిషన్ కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం లెక్కింపు జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పోస్ట్ ద్వారా వచ్చి కలెక్టరేట్లో స్టోరేజ్ చేసిన సర్వీస్ ఓటర్లు ఈటీపీబిఎస్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మంగళవారం ఉదయం 5 గంటలకు ఆర్జీఎంలోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి తీసుకెళ్తామని. రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు ఇతర సాంకేతిక పరికరాలను అనుమతించమని ఈ విషయాన్ని గుర్తెరిగి రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు నడుచుకోవాలని నారు. ఈ సమావేశంలో పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.

## కౌంటింగ్ కు అంతా సిద్ధం

విజయవాడ, జూన్ 3,ఓట్ల లెక్కింపునకు సమయం సమీపిస్తుండడంతో ఏపీలోని ప్రధాన పార్టీల్లో టెన్షన్ మొదలైంది. ఎగ్జిట్ పోల్ ఫలితాలతో గెలుపు తమదంటే కాదు తమదంటూ చెప్పుకుంటున్నా.. ఓటర్ మహాశయుడు ఎవరి వైపు మొగ్గుచూపారో అనే ఆందోళన లోలోన ఉంది. ఈ క్రమంలో కౌంటింగ్ కేంద్రాల్లో బలంగా నిలిచే, పార్టీ విజయాన్ని డిసైడ్ చేసే వారిని కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకుంటున్నాయి. ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన ఉన్నవారిని, నిబంధనలపై పట్టున్న వ్యక్తులను ఎంపిక చేసి కౌంటింగ్ కేంద్రాల్లో అనుసరించాల్సిన విధానంపై రాజకీయ పార్టీలు శిక్షణ ఇస్తున్నాయి.అనుక్షణం అప్రమత్తత అవసరంకౌంటింగ్ హాళ్లలో ఘర్షణలకు దిగే అవకాశం ఉందని, ఉద్రిక్తత రేకెత్తించే ప్రణాళికలు ఉన్నాయంటూ టీడీపీ, వైసీపీ పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే తమ పార్టీ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయా పార్టీలు సూచిస్తున్నాయి. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం రికార్డు అవుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని సంయమనం పాటించాలని ఆయా పార్టీల పెద్దలు సూచిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీ ఏజెంట్లు పదేపదే అభ్యంతరాలు, అనుమానాలు వ్యక్తం చేసినా వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత కౌంటింగ్ సూపర్‌వైజర్లు, రిటర్నింగ్ ఆఫీసర్లదేనని, తమ పార్టీ ఏజెంట్లు అక్కడ జరుగుతున్న పరిస్థితులను నిశితంగా గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.లిఖిత పూర్వకంగా ఫిర్యాదుఓట్ల లెక్కింపు సందర్భంగా ఏవైనా అభ్యంతరాలు, అనుమానాలుంటే కౌంటింగ్ ఏజెంట్లు కచ్చితంగా లిఖితపూర్వుకంగా రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు అందజేసి అక్నాలెడ్జ్‌మెంట్ (ధ్రువీకరణ) పత్రం తీసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. నోటితో అభ్యంతరం తెలిపితే అది చట్టం ముందు నిలబడదని, ప్రతీది లిఖితపూర్వకంగా తెలియజేయాలని పదే పదే సూచించారు. ప్రతి నియోజకవర్గానికి ఐదు చొప్పున లాటరీ ద్వారా ఎంపిక చేసిన బూతుల్లో వీవీ ప్యాట్‌లు లెక్కిస్తారు. ఈవీఎంలలో పడిన ఓట్లకు, వీవీ ప్యాట్లలో ఉన్న ఓట్లకు తేడా ఉంటే ఫైనల్‌గా వీవీ ప్యాట్లలోని ఓట్లనే పరిగణిస్తారు. ఈ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయా పార్టీలు తమ ఏజెంట్లకు అవగాహన కల్పిస్తున్నాయి.ఆ సయమంలో రీ కౌంటింగ్ హక్కుఓట్ల లెక్కింపు



ప్రారంభంలోనే ఈవీఎంల సెక్యూరిటీని ఏజెంట్లు జాగ్రత్తగా పరిశీలించాలని రాజకీయ పార్టీలు తమ ఏజెంట్లకు సూచిస్తున్నాయి. ఈవీఎంలలో ఓట్ల వివరాలు, కౌంటింగ్ సిబ్బంది ద్వారా స్పష్టంగా వినిపించకపోతే ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకోవాలని ఆయా పార్టీల పెద్దలు కోరుతున్నారు. ఓట్ల లెక్కింపు మొదలైన క్షణం నుంచి చిట్ట చివరి వరకూ ఏజెంట్లు కేంద్రంలోనే ఉండాలని, లెక్కింపు పూర్తయి గెలిచిన అభ్యర్థి ధ్రుమీకరణ పత్రం తీసుకున్న తర్వాతే బయటకు రావాలని అవగాహన కల్పిస్తున్నారు. కౌంటింగ్‌లో అనుమానాలు తలెత్తితే రీ కౌంటింగ్ కోరాలని ఏజెంట్లకు సూచిస్తున్నారు.ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభంమంగళవారం ఉదయం 8 గంటల కల్లా లెక్కింపు ప్రారంభం కానుంది. ఏజెంట్లు ఉదయం 6 గంటల లోపే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఏజెంట్‌గా ఉంటున్న వ్యక్తులు భారత ప్రభుత్వ గుర్తింపు కార్డు, ఏజెంట్ నియామక పత్రం రెండూ తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలి. కౌంటింగ్ కేంద్రంలోకి ఫారం?17 సీ, పెన్ను లేదా పెన్సిల్, తెల్ల కాగితాన్ని మాత్రమే అనుమతిస్తున్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. ఈ క్రమంలో ప్రతి రౌండ్ కౌంటింగ్‌లో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయా పార్టీల పెద్దలు ఏజెంట్లకు సూచిస్తున్నారు.

## తేలనున్న 2387 మంది భవితవ్యం

**175 నియోజకవర్గాలకు 2387 మంది పోటీ**
**25 పార్లమెంట్ నియోజకవర్గాలకు 454 మంది**

విజయవాడ, జూన్ 3,ఆంధ్రప్రదేశ్‌లో మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనుంది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రారంభం అవుతుంది. ఉదయం 8.30 కి ఇఎం ల కౌంటింగ్ ప్రారంభిస్తారు. కాగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బరిలో ఉన్న 2387 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న 454 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అత్యధికంగా తిరుపతి అసెంబ్లీ స్థానంలో పోటీలో ఉన్న 46 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. అత్యల్పంగా చోడవరంలో ఆరుగురు అభ్యర్థులు మాత్రమే పోటీ చేశారు. అత్యధికంగా విశాఖ పార్లమెంటు బరిలో 33 మంది అభ్యర్థులు? రాజమండ్రి పార్లమెంటు పరిధిలో అత్యల్పంగా 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తొలి ఫలితం నరసాపురం, కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 13 రౌండ్లతో వెల్లడవ్వనుంది. రంపచోడవరం, చంద్రగిరి నియోజకవర్గాల్లో 29 రౌండ్లతో చివరిగా ఫలితం వెలువడనుంది. భీమిలి, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాల్లో 26 రౌండ్లు కౌంటింగ్ జరుగుతుంది. రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య అన్ని నియోజకవర్గాల తుది ఫలితాలు వెలువడే విధంగా చర్యలు చేపట్టారు అధికారులు.ఇక అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో గరిష్టంగా



27 రౌండ్లు కౌంటింగ్ జరుగుతుంది. రాజమండ్రి, నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గాల్లో 13 రౌండ్లలో ఫలితం లేతిపోతుంది. కౌంటింగ్ హాల్‌లో ప్రక్రియ అంతా సీసీటీవీల పర్యవేక్షణలో ఉంటుంది. మంగళవారం అన్ని జిల్లాల్లో పూర్తిగా డ్రై డే ఉంటుంది. కౌంటింగ్ కోసం రాష్ట్రంలో 45 వేల మంది పోలీసులు అన్ని చోట్లా ఎన్నికల విధుల్లో ఉండనున్నారు. కౌంటింగ్ సెంటర్ ల చుట్టూ రెడ్ జోన్ ఏర్పాటు చేశారు.. రెడ్ జోన్ దాటి ఎవరికీ లోపలికి అనుమతి లేదు. రాష్ట్రంలో ఎక్కడా అల్లర్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు అధికారులు. గెలిచిన అభ్యర్థులు ర్యాలీలు,విజయోత్సవాలు నిర్వహణకు అనుమతి లేదు.

## వేగంగా కదులుతున్న నైరుతి....



హైదరాబాద్, జూన్ 3 దేశంలోకి నైరుతి రుతుపవనాలు) ముందే ప్రవేశించడంతోపాటు చాలా వేగంగా దేశం నలువైపులా విస్తరిస్తున్నాయి. వీటి ప్రభావం అప్పుడే తెలుగు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురవడంతోపాటు....వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత నెల 30న కేరళను తాకిన రుతుపవనాలు...కర్ణాటక( మీదుగా రాయలసీమలోకి ప్రవేశించాయి. ఈనెల 6న రుతుపవనాలు తెలంగాణను తాకే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపింది. ఆదివారం హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో వర్షం కురిసింది.ఏపీలోకి రుతుపవనాలుకేరళలోకి ముందగానే ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు....కర్ణాటక మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. చాలా రోజుల తర్వాత జూన్ 1, 2 తేదీల్లోనే రుతుపనాలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభించడానికి రుతుపవనాలు రాక ఎంతో ఆవశ్యకం. రాయలసీమ జిల్లాల్లోకి ప్రవేశించిన రుతుపవనాలు క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. దీని ప్రభావంతో ఏపీలోనూ పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. ఈనెల 6న రుతుపవనాలు తెలంగాణను తాకే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. రాయలసీమలోకి రుతుపవనాల రాకతో తెలంగాణలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆదివారం మొత్తం మబ్బులు పట్టి చిరుజల్లులు కురిశాయి. హైదారాబాద్‌లో అయితే భారీ వర్షమే కురిసింది.తెలంగాణ జిల్లాల్లో ఈదురుగాలులునైరుతి రుతుపవనాల రాకను పురస్కరించుకుని తెలంగాణ జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అసిఫాబాద్ జిల్లా వాంకిడిలో ఈదురుగాలులకు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. జగిత్యాల జిల్లా కోరుట్లలో పిడుగుపడి చెట్లు నేలకూలాయి. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది. మూడు రోజులు వర్షాలురాగల మూడురోజులపాటు తెలంగాణ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.ఉపరితల ఆవర్తన ప్రభావంతో నల్గొండ(, ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డితోపాటు ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణశాఖ వెల్లడించింది.

# సంపాదకీయం

మంగళవారం 04-06-2024

## ఎగ్జిట్ పోల్స్ లో లెక్క తేడా ఎందుకు

లోక్ సభ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ముగిసింది. ఏడు దశల్లో ఈ పోలింగ్ మొదలు కాగా.. శనివారంతో ఇది ముగిసింది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం పోలింగ్ మూసిన తర్వాత సాయంత్రం ఆరున్నర గంటల నుంచి ఎగ్జిట్ పోల్స్ తమ అంచనాలను వెల్లడిస్తాయి. లోక్ సభ ఎన్నికలతో పాటు పలు రాష్ట్రాల్లో ఎన్నికలు కూడా జరిగాయి. దీంతో అక్కడ ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే దానిపై విపరీతంగా చర్చ నడుస్తోంది. ఎన్నికలు నిర్వహించే సమయంలో ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ సందడి మొదలవుతుంది. ఓటరు నాడి పట్టుకునేందుకు అనేక మీడియా సంస్థలు, ఇతర ఏజెన్సీలతో సర్వేలు నిర్వహిస్తుంటాయి. పోలింగ్ కు ముందు నిర్వహించే వాటిని ఒపీనియన్ పోల్స్ అంటారు. సుప్రీంకోర్టు, కేంద్ర ఎన్నికల సంఘం విధించిన నిబంధనలకు అనుగుణంగా పలు సంస్థలు ఒపీనియన్ పోల్స్ నిర్వహిస్తాయి. పార్టీల మధ్యపొత్తు, ఇతర వ్యవహారాల ఆధారంగా పలు సంస్థలు వివిధ దశల్లో ఒపీనియన్ పోల్స్ వెల్లడిస్తాయి. ఇక ఓటర్ల నాడి పసిగట్టేందుకు పలు ఏజెన్సీలు సర్వేలు నిర్వహిస్తాయి. సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే రైతులు, యువతి యువకులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు.. ఇలా అన్ని వర్గాల వారి నుంచి సర్వే సంస్థలు అభిప్రాయాలు సేకరిస్తాయి. ఆ తర్వాత ఒపీనియన్ పోల్స్ ను వెల్లడిస్తాయి. ఒపీనియన్ పోల్స్ అనేవి సందర్భాలను బట్టి మారుతూ ఉంటాయి. అయితే ఎన్నికలకు ముందు పది రాజకీయ పార్టీలు వివిధ సంస్థల ద్వారా ఇలాంటి ఒపీనియన్ పోల్స్ ను నిర్వహిస్తాయి. అందులో వచ్చిన ఫలితాలు ఆధారంగా తమ అడుగులు వేస్తాయి.ఎన్నికల పూర్తయిన తర్వాత.. వెల్లడించే వాటిని ఎగ్జిట్ పోల్స్ అంటారు.. ఇందులో భాగంగా ఎన్నికలు జరిగిన అనంతరం పోలింగ్ బూత్ లో ఓటర్ల నుంచి సమాచారం సేకరిస్తారు. ఓటర్లు చెప్పిన సమాధానం ఆధారంగా ఒక అంచనాకు వస్తారు. ఏ పార్టీకి ఎంత ఓటింగ్ వస్తుంది? ఎన్ని సీట్లు గెలుస్తుంది? ఎంతమంది ప్రజల మనసు గెలుచుకుంటుంది? అనే అంశాల ఆధారంగా అంచనా వేస్తారు. ఎన్నికలు ముగిసిన అనంతరం ఎగ్జిట్ పోల్స్ ను ప్రకటిస్తారు.ఎగ్జిట్ పోల్స్ ఫలితాలకు దగ్గరగా ఉంటాయి. ముందుగానే చెప్పినట్టు ఒపీనియన్ పోల్స్ పరిస్థితులను బట్టి మారుతూ ఉంటాయి. ఒపీనియన్ పోల్స్ ఎన్నికల ముందు నిర్వహిస్తుంటారు కాబట్టి.. ఆ సమయంలో ఓటర్ మూడ్ ను అవి ప్రతిబింబిస్తుంటాయి. అదే ఎగ్జిట్ పోల్స్ విషయానికొస్తే అలా ఉండదు. ఎన్నికల తర్వాత ఓటర్ వేసిన ఓటు ఆధారంగానే అవి ఉంటాయి కాబట్టి.. ఫలితాలను దాదాపుగా ప్రతిబింబిస్తాయని రాజకీయ విశ్లేషకులు అంటుంటారు.ముఖ్యంగా ఏపీ ఎన్నికల విషయంలో ఈ చర్చ రసవత్తరంగా మారింది. వైసిపి, కూటమి? రెండిట్లో ఏది అధికారంలోకి వస్తుందో అంతు పట్టడం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఎగ్జిట్ పోల్స్ కు.. ఎగ్జాక్ట్ పోల్స్ కు మధ్య తేడా ఉంటుందా? ఎగ్జిట్ పోల్స్ ప్రామాణికత ఎంత? గత ఎన్నికల్లో వాస్తవానికి దగ్గరగా ఫలితాలు ఇచ్చాయా? అన్న బలమైన చర్చ నడుస్తోంది. 2009, 2014, 2019 ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు, తుది ఫలితాలు ఒకసారి పరిశీలిస్తే.. అంచనాలు తప్పినట్లు తెలుస్తోంది. గత రెండు ఎన్నికల్లో ఎన్డీఏ మెజారిటీకి సంబంధించి అంచనా వేయడంలో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పాయి. విజయం సాధిస్తాయని చెప్పడంలో మాత్రం సక్సెస్ అయ్యాయి.2009లో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ నాలుగు ఎగ్జిట్ పోల్స్ యూపీఏ విజయాన్ని తక్కువగా అంచనా వేశాయి. యూపీఏకు 195, ఎన్డీఏ కు 185 సీట్లు వస్తాయని అంచనా వేయగలిగాయి.అయితే అప్పుడు యూపీఏ కు 252 సీట్లు, ఎన్డీఏకు 158 సీట్లు లభించాయి. యూపీఏ కూటమిలోని కాంగ్రెస్ పార్టీకి 206 సీట్లు, ఎన్డీఏ కూటమిలోని బిజెపికి 116 సీట్లు వచ్చాయి.2014 ఎన్నికల్లో సైతం ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పాయి. దాదాపు 8 ఎగ్జిట్ పోల్ సంస్థలు బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ కు 283 సీట్లు, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కు 105 సీట్లు వస్తాయని అంచనా వేశాయి. మోడీ వేవ్ పెరుగుతుందని పసిగట్టలేకపోయాయి. సంస్థల అంచనాలను తారుమారు చేస్తూ ఎన్డీఏ 336 సీట్లను గెలుచుకుంది. యూపీఏ కేవలం 60 స్థానాలకే పరిమితం అయ్యింది. ఒక్క బిజెపికే 282 స్థానాలు రాగా.. కాంగ్రెస్ పార్టీ 44 స్థానాలకు పరిమితం అయ్యింది.2019 ఎన్నికల్లో సైతం ఎగ్జిట్ పోల్స్ అనుకున్న స్థాయిలో అంచనాలు సక్సెస్ కాలేదు. ఎన్డీఏ కూటమి 306 సీట్లు సాధిస్తుందని అంచనా వేశాయి 13 ఎగ్జిట్ పోల్స్ సంస్థలు. కానీ ఏకంగా ఎన్డీఏ 353 సీట్లు గెలుచుకోవడం గమనార్హం. ఒక్క బీజేపీ మాత్రమే 303 స్థానాలను గెలుచుకుంది. అయితే ఎగ్జిట్ పోల్స్ ఇలా అంచనాలు తప్పుతున్నా? ప్రజల్లో మాత్రం వాటిపై ఆసక్తి తగ్గడం లేదు.ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్ వెల్లడయ్యాయి.ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో ఎగ్జిట్ పోల్స్ క్లియర్ కట్ గా చెప్పాయి.ఏపీలవ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 లోక్సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వైసిపి ఒంటరి పోరుకు మొగ్గుచూపింది. టిడిపి, బిజెపి, జనసేన కూటమి కట్టాయి. తెలుగుదేశం పార్టీ 144 అసెంబ్లీ, 17 లోక్సభ స్థానాల్లో పోటీ చేసింది. జనసేన 21 అసెంబ్లీ, రెండు పార్లమెంటు సీట్లలో పోటీ చేసింది. బిజెపి 10 అసెంబ్లీ,ఆరు లోక్సభ స్థానాల్లో బరిలో దిగింది. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి సైతం అదృష్టాన్ని పరీక్షించుకుంది. దేశవ్యాప్తంగా నాలుగో విడతలో భాగంగా మే 13న పోలింగ్ జరిగింది. జూన్ 4న ఫలితాలను ప్రకటించనున్నారు. అధికారానికి కావలసిన మ్యాజిక్ ఫిగర్ 88. దీంతో వివిధ సంస్థలు ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్ ఆసక్తికరంగా మారాయి.అయితే మెజారిటీ జాతీయ సర్వే సంస్థలు టిడిపి కూటమికే చాన్స్ అని తేల్చేశాయి.

# ఉమ్మడి రాజధాని బంధానికి తెర..

### ఇకపై తెలంగాణకు శాశ్వత రాజధానిగా హైదరాబాద్



హైదరాబాద్, జూన్ 3: ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య పదేళ్లపాటు కొనసాగిన ఉమ్మడి రాజధాని హైదరాబాద్ బంధానికి తెరపడింది. జూన్ 2తో ఉమ్మడి రాజధాని గడువు ముగిసింది. ఏపీ పునర్విభజన చట్టం- 2014లోని సెక్షన్ 5 ప్రకారం? జూన్ 2, 2014 నుంచి హైదరాబాద్ ను ఏపీ, తెలంగాణకు 10 ఏళ్లపాటు హైదరాబాద్ ను ఉమ్మడి రాజధానిగా కేంద్రం ప్రకటించింది కేంద్రం.ఆ గడువు పూర్తి కావటంతో తెలంగాణకు ఇక నుంచి హైదరాబాద్ శాశ్వత రాజధానిగా ఉండనుంది. అయితే విభజన చట్టంలోని సెక్షన్-8 ప్రకారం హైదరాబాద్ ఉమ్మడి రాజధాని ప్రాంతంలో పౌరుల ప్రాణ, ఆస్తి, రక్షణ, భద్రతను కాపాడే బాధ్యతను గవర్నర్‌కు అప్పగించారు. ఇప్పుడీ గడువు ముగియడంతో ఈ బాధ్యతను ప్రభుత్వం చూసుకుంటుంది. ఏపీకి హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్నప్పటికీ విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2015లోనే అమరావతిని రాజధానిగా ప్రకటించి పాలన అందించారు. 2019లో అధికారాన్ని చేజిక్కించుకున్న వైఎస్ జగన్ మూడు రాజధానులు ప్రకటించినప్పటికీ.. అమరావతి కేంద్రంగానే పాలనను కంటిన్యూ చేశారు. ఈ పదేళ్ల కాలంలో పాలన కోసం హైదరాబాద్ లోనూ పలు భవనాలను ఏపీకి కేటాయించారు.సోమాజిగూడలోని రాజ్‌భవన్‌కు సమీపంలో ఉన్న లేక్‌వ్యూ అతిథి గృహాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి కేటాయించారు. ఇప్పుడు హైదరాబాద్ లో ఏపీకి కేటాయించిన కొన్ని భవనాల భవిష్యత్తుపై సందిగ్ధత నెలకొంది. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా పదేళ్ల తర్వాత కూడా కొనసాగించాలనే అంశంపై రాజకీయ పార్టీలు ఏవీ స్పందించలేదని ఎక్స్ వేదికగా జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకుడు లక్ష్మీనారాయణ విమర్శించారు. ఇక ఆ దేవుడే ఏపీని ఆదుకోవాలని లక్ష్మి నారాయణ అన్నారు.మరోవైపు మాజీ పీసీసీ చీఫ్ డా సాకే శైలజానాథ్ విచారం వ్యక్తం చేస్తూ హైదరాబాద్?ను ఉమ్మడి రాజధానిగా మరో 10 సంవత్సరాలు పొడిగించాలని డిమాండ్ చేశారు.

# రేవంత్ రెడ్డి సీఎం కావచ్చు.. కానీ ఎన్నటికీ ఉద్యమకారుడు కాలేడు : హరీశ్‌రావు



హైదరాబాద్, జూన్ 3: రేవంత్ రెడ్డి సీఎం కావచ్చు.. కానీ ఎన్నటికీ ఉద్యమకారుడు కాలేడని బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన ద్రోహీగానే చరిత్రలో మిగిలిపోతాడే తప్ప.. ఏనాటికీ ఉద్యమకారుడు కాలేడని విమర్శించారు. ఉద్యమకారులన్న ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే హరీశ్‌రావు.. జెండా ఆవిష్కరించారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం స్వరాష్ట్ర పోరాటం చేశామని గుర్తు చేశారు.ఎలాంటి ఆశలు లేకుండా, ఎలాంటి ఆకాంక్షలు లేకుండా, ప్రజల కోసం, తెలంగాణ ఆత్మగౌరవం కోసం, దశాబ్దాల కలను నిజం చేయడం కోసం పనిచేసిన వారందరినీ గుర్తుచేసుకోవడమే ఈ దశాబ్ది ఉత్సవాల్లో నిజమైన పండగ అని హరీశ్‌రావు అన్నారు. ఉద్యమానికి నాయకత్వం వహించిన జిల్లా నేతలను గౌరవించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి నిర్ణయించడం హర్షనీయమని హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో ప్రతి ఒక్కరూ ఉద్యమకారులే అని.. ప్రతి ఒక్కరినీ సన్మానించుకోవాలని తెలిపారు.తెలంగాణకు కేసీఆర్ శ్రీరామరక్ష అని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర అవతరణ సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన పత్రికా ప్రకటనల్లో ఎక్కడా జై తెలంగాణ అని లేదని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ప్రకటనల్లో జై తెలంగాణ.. జైజై తెలంగాణ అని కచ్చితంగా ఉండేదని గుర్తుచేశారు. ఆరోజు సమైక్య పాలనలో జై తెలంగాణ మాటను నిషేధించారని తెలిపారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ పదం మాయమైందని విమర్శించారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ సోయిని ఖతం చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కుల కోసం, ప్రయోజనాల కోసం పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని స్పష్టం చేశారు.

# స్టూడెంట్స్ ఇళ్లకు ఆన్సర్ షీట్స్

వరంగల్, జూన్ 3(న్యూస్ పల్స్)కాకతీయ యూనివర్సిటీలో మరో బాగోతం బయట పడింది. వర్సిటీ పరీక్షల విభాగంలో డిగ్రీ సెమిస్టర్ పేపర్ల మూల్యాంకనం జరుగుతుండగా, కాసులకు కక్కుర్తి పడిన కొంతమంది దినసరి కూలీలు ఆ బండిల్స్ నుంచి ఆన్సర్ బుక్ లెట్స్ ను గుట్టుగా విద్యార్థులకు చేరవేశారు. సదరు విద్యార్థులు జవాబులు రాసిన అనంతరం వాటిని తిరిగి యథావిధిగా బండిల్స్ లోకి చేర్చారు. వారం రోజుల కిందట జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా, కాకతీయ యూనివర్సిటీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరీక్షల విభాగంలో పని చేస్తున్న దినసరి కూలీలను తొలగించి, రెండు రోజుల పాటు మూల్యాంకన ప్రక్రియ నిలిపివేశారు.కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షల నిర్వహణ అనంతరం విద్యార్థుల ఆన్సర్ బుక్ లెట్స్ అన్నింటినీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ కు తరలిస్తున్నారు. ఇదిలాఉంటే డిగ్రీ పూర్తి చేసే విద్యార్థుల సౌకర్యం కోసం ఆరో సెమిస్టర్ పేపర్ల మూల్యాంకనం ప్రారంభించారు. ఇప్పటికే ఆయా పరీక్షలు పూర్తి కావస్తుండగా, మే 23న జరిగిన ఓ ఘటన ఇప్పుడు కాకతీయ యూనివర్సిటీని కుదిపేస్తోంది. వర్సిటీ పరీక్షల విభాగంలో దాదాపు 25 మంది దినసరి కూలీలుగా పని చేస్తుండగా, అందులో మాదాసి సునీల్, గడ్డం రాణా ప్రతాప్, నాసం శ్రీధర్ అనే ముగ్గురు వ్యక్తులు అక్రమాలకు తెరలేపారు. ఎవరికీ ప్రవేశం ఉండని మూల్యాంకన క్యాంప్ లోకి ఎంటర్ అవడంతో పాటు అందులో నుంచి కొన్ని ఆన్సర్ బుక్ లెట్స్ తీసుకుని బయటకు వచ్చారు.వాటిని ఆయా పేపర్ల విద్యార్థులకు చేరవేసి, వారు ఆన్సర్స్ రాసిన తరువాత వాటిని యథావిధిగా సంబంధిత బండిల్స్ లోకి చేర్చారు. ఆ ఘటన వారం రోజులకు మే 30వ తేదీన పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ డా.తిరుమలదేవి సీసీ కెమెరాలు పరిశీలిస్తుండగా, గుర్తించి కంట్రోలర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కంట్రోలర్ నరిసింహచారి, అడిషనల్ కంట్రోలర్ తిరుమలదేవి కాకతీయ యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఓ వైపు పోలీసులు విచారణ జరుపుతుండగా, కాకతీయ యూనివర్సిటీ అధికారులు ఆరో సెమిస్టర్ ఆన్సర్ బుక్ లెట్ల మూల్యాంకనాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. వర్సిటీ పరీక్షల విభాగంలో పని చేస్తున్న మిగతా దినసరి కూలీలను తొలగించి, రెగ్యులర్ ఉద్యోగులకు విధులు కేటాయిస్తున్నారు. ఈ మేరకు రెండు రోజుల పాటు మూల్యాంకనం నిలిపి వేశారు. దీంతో సోమవారం మూల్యాంకన ప్రక్రియ తిరిగి మొదలు కానున్నట్లు తెలుస్తోంది.వర్సిటీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే ముగ్గురూ కలిసి 50 ఆన్సర్ బుక్ లెట్స్ ను బయటకు తీసుకెళ్లి, మళ్లీ బండిల్స్ లోకి చేర్చారని ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. కాగా ఒక్కో పేపర్ కు సదరు సిబ్బంది ఐదు వేల రూపాయల నుంచి 10 వేల వరకు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలాఉంటే వారంతా కొన్నేళ్ల ఉంచి ఇదే పరీక్షల విభాగంలో పని చేస్తుండగా, ఇప్పటి వరకు ఎన్ని సార్లు ఇలా ఆన్సర్ బుక్ లెట్స్ మార్పిడి చేశారనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# ఎగ్జిట్ పోల్స్‌కు ఎలాంటి విలువ లేదు.. వాటిని ఇంట్లో తయారు చేశారు: మమతా బెనర్జీ



కోల్‌కతా: ఎగ్జిట్ పోల్స్‌కు ఎలాంటి విలువ లేదని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. రెండు నెలల ముందుగానే వాటిని ఇంట్లో తయారు చేశారని ఆమె విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఈసారి బెంగాల్‌లో టీఎంసీ కంటే బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయని మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆదివారం దీనిపై స్పందించారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఎగ్జిట్ పోల్స్ లేవని అన్నారు. విలువ లేని ఇలాంటి ఎగ్జిట్ పోల్స్‌ను పత్రికలు చూపిస్తున్నాయని విమర్శించారు. ‘2016, 2019, 2021లో ఎగ్జిట్ పోల్స్ ఎలా నిర్వహించారో మనం చూశాం. అంచనాలు ఏవీ నిజం కాలేదు’ అని ఒక టీవీ ఛానెల్‌తో అన్నారు. ఎగ్జిట్ పోల్స్‌ను మీడియా కోసం కొందరు వ్యక్తులు రెండు నెలల కిందట ఇంట్లో తయారు చేశారని ఆమె ఆరోపించారు. అందుకే వాటికి ఎలాంటి విలువ లేదని అన్నారు.కాగా, తన ఎన్నికల సభలకు వచ్చిన ప్రజా స్పందనను ఎగ్జిట్ పోల్స్ ధృవీకరించ లేకపోయాయని మమతా బెనర్జీ ఎద్దేవా చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటాను ముస్లింలు తీసుకుంటున్నారని బీజేపీ తప్పుడు ప్రచారం చేసిందని ఆమె విమర్శించారు. ముస్లింలు బీజేపీకి ఓటు వేస్తారని తాను అనుకోనని అన్నారు. అలాగే బెంగాల్‌లో సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు బీజేపీకి సహకరించాయని మమతా బెనర్జీ మరోసారి ఆరోపించారు.

# జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ త్వరలో మొదలుపెడుతాం: సీఈసీ



న్యూఢిల్లీ: త్వరలోనే జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియను మొదలుపెట్టనున్నట్లు ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడించారు. ఇవాళ మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని తెలిపారు. ఎన్నికల తర్వాత పశ్చిమ బెంగాల్‌లో హింస జరగదన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. కౌంటింగ్ ప్రక్రియపై అనుమానాలు అవసరం లేదని, అధికారులు, ఏజెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఆర్వోలు, ఏఆర్వోలు, అబ్జర్వర్లతో పాటు ప్రజలు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉంటారని సీఈసీ రాజీవ్ కుమార్ తెలిపారు.

# జూపల్లి కృష్ణారావుని మంత్రివర్గం నుంచి తొలగించాలి : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

వనపర్తి : జూపల్లి కృష్ణారావుని మంత్రివర్గం నుంచి వెంటనే తొలగించాలి. రాజకీయ హత్యలపై నిష్పక్షపాత విచారణ జరపాలని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో తెలంగాణ దశాబ్ద ఉత్సవాల్లో భాగంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డితో కలిసి జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లా ప్రాంతాలు జూపల్లి కృష్ణారావు వల్ల కల్లోలిత ప్రాంతాలుగా మారుతున్నాయ ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీపల్లి గ్రామంలో బొడ్డు శ్రీధర్ రెడ్డి హత్య జరిగి 11రోజులు అవుతున్నా నేటికి హంతకులను పట్టు కోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల కాలంలో రెండు హత్యలు, ఒక హత్యాయత్నం, దాడులు పెరిగిపోయాయి. బీఆర్ఎస్ పార్టీ నాయకులకు బెదిరింపులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.సీఎం రేవంత్ రెడ్డి పేగులు తీసి మెడల వేసుకుంటా, ఇతర పార్టీ నాయకులను బొంద పెడుతా వంటి మాటలతో కాంగ్రెస్ నాయకులు రెచ్చిపోతున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. కక్షసాధింపు చర్యలు మానుకొని ప్రజాస్వామ్యయుతంగా పాలన చేయాలని హితవు పలికారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో నవీన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్స్, పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలియజేశారు.



# షాక్ ఇస్తున్న వైసీపీ లెక్కలు

తిరుపతి, జూన్ 3,ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీసీ నాయకులు కొందరు విచిత్రమైన పరిస్థితి అనుభవిస్తున్నారట. పోటా పోటీగా సై అంటే సై అనేలా సాగినా ఎన్నికలలో అత్యంత కీలమైన పోల్ మేనేజ్‌మెంట్‌లో సూపర్ సక్సెస్ అయ్యామని భావించిన నేతలకు పోలింగ్ తరువాత బూత్‌ల వారీగా ఓటింగ్ శాతంపై చేపట్టిన లెక్కలు షాక్ ఇస్తున్నాయంట. ఓటింగ్ అప్పుడు పోల్ మేనేజ్‌మెంట్ పకడ్బందీగా చేసామనుకున్న అభ్యర్థులు అందులో జరిగిన లొసుగులు బయటకు రావడంతో తెగ ఆందోళన చెందుతున్నారంట.ఎన్నికల ముందు అసంతృప్తి గా కొందరు ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు చేతివాటం గట్టిగానే చూపించారని అభ్యర్థుల సమీక్షల్లో వెల్లడైందంటున్నారు. అసంతృప్తితో ఉన్న నేతలను ఎన్నికల ముందు వారిని బుజ్జగించి, బతిమాలి నయానో, భయానో వారి ఎన్నికలకు సిద్ధం చేశామనుకుంటే చివరికి ఇలా చేస్తారా అంటూ కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు రగిలిపోతున్నట్లు తెలిసింది. ఆ కుచ్చుటోపీలు పెట్టిన పరిస్థితి ముఖ్యంగా కుప్పం, నగరి, కాళహస్తి, పలమనేరు, సత్యవేడు, జీడినెల్లూరు, పూతలపట్టు, తంబళ్ళపల్లె , మదనపల్లెలో బాగా ఎక్కువ జరిగినట్లు అధికార పార్టీ శ్రేణులు అంటున్నాయి.కుప్పంలో చంద్రబాబుకు చెక్ పెట్టి ఎలాగైనా గెలవడానికి వైసీపీ అక్కడ ఓటుకు నాలుగు వేల వరకు ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ఎన్నికల ముందు వరకు అక్కడి వైసిపిలో గ్రూపులుగా విడిపోయిన నేతలు ఎమ్మెల్యే అభ్యర్థి అయిన ఎమ్మెల్సీ భరత్‌కు వ్యతిరేకంగా పనిచేశారు.. అ గొడవలను మంత్రి పెద్దిరెడ్డి చక్కదిద్దారు. దాంతో తిరిగి యాక్టివ్ అయిన అసంతృప్తి నేతలు పోల్ మేనేజ్‌మెంట్ సమయంలో చేయాల్సిన పనిని పూర్తిస్థాయిలో చేయకుండా.. యాండ్ ఇచ్చారన్న టాక్ వినిపిస్తోంది. గత కొన్నేళ్ళుగా పనులు లేకుండా .. చేసిన పనులకు బిల్లులు రాకుండా ఉన్న కొందరు నేతలు.. పోల్ మేనేజ్‌మెంట్ లో చేయాల్సిన ఖర్చు పూర్తి స్థాయిలో



చేయకుండా సొంత మేనేజ్‌మెంట్ చూసుకున్నారంట.నగరిలో ఓటుకు రెండువేల వరకు ఇవ్వడానికి మంత్రి రోజా టీం పార్టీ నేతలకు నోట్ల కట్టలు పంచిపెట్టిందంట. అది కూడా పూర్తి స్థాయిలో ఓటర్లకు చేరలేదన్నసమాచారంతో మంత్రి రోజా ఫైర్ అవుతున్నారంట. ఎందుకు చేయలేదని లెక్కలు చెప్పాలని ఆమె నిలదీస్తుండటంతో కొందరు నేతలు సీన్‌లో లేకుండా మాయమై పోయారంట. అసలే పార్టీలో మంచి పట్టున్న అసంతృప్తి నేతలు పోలింగ్ ముందు పార్టీ మారడంతో ఢీలా పడిన రోజా టీం తాజాగా నమ్ముకున్న వారే టోపీ పెట్టడంతో దిక్కుతోచని స్థితిలో పడిందంటున్నారు.పలమనేరులో వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకటేగౌడాకు స్దానిక నేతలు ఇలానే షాక్ ఇచ్చారట. అనుకున్నంతగా స్థాయిలో పోల్ మేనేజ్‌మెంట్ జరగలేదని తెలిసి ఆయన నీరస పడిపోయారంట.తాను పంచిన మొత్తానికి ఓటర్లకు చేరిన అమౌంట్‌కు పొంతన కుదరక తలపట్టుకుని వాపోతున్నారంట.ఇక కాళహస్తిలో బియ్యపు మధుసుధన్ రెడ్డి, తంబళ్ళపల్లెలో ద్వారకానాథ్‌రెడ్డికి స్థానిక నేతలు హ్యాండ్ ఇచ్చి సొంత ఇళ్లలు చక్కపెట్టుకున్నారని తేలిందంట.తిరుపతి , చంద్రగిరి, పుంగనూరు, పీలేరులో మాత్రమే వైసీపీ అభ్యర్థుల మేనేజ్‌మెంట్ సక్రమంగా నడిచిందంటున్నారు. అక్కడి అభ్యర్థులు నమ్ముకున్న వారు పూర్తి స్థాయిలో అనుకున్న విధంగా ఖర్చు పెట్టారట. డినెల్లూరు, సత్యవేడు, పూతలపట్టుల్లో అభ్యర్థులను అక్కడి వైసీపీ శ్రేణులు దారుణంగా మోసం చేశాయని వైసీపీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నిజానికి జిల్లా వ్యాప్తంగా వైసిపినే ఓట్ల కోసం ఎక్కువ ఖర్చుపెట్టిందంటున్నారు. డీపీ అందులో సగమే ఖర్చు చేసిందంట. టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ పక్కాగా జరిగితే .. వైసిపి అసంతృప్తి కేడర్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారనే సమాచారం. కౌంటింగ్ టైం దగ్గర పడిన తరుణంలో వైసీపీ అభ్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోందటఅలాంటి వారిని కొన్నిచోట్ల లెక్కలు తీసి ప్రశ్నిస్తే.. తాము నగదు పంచామని తమని అనుమానించడం ఏంటని సదరు లోకల్ లీడర్లు ఎదురు తిరుగుతున్నారంట. దాంతో సదరు కేండెట్లు ఎవరికి చెప్పుకోవాలో తెలియక తేలు కుట్టిన దొంగల్లా ఉండిపోతున్నారంట. ఎన్నికల ముందు వరకు అసంతృప్తి గా నేతలను దారికి తెచ్చుకుని ఎన్నికలకు వెళితే చివరి సమయంలో ఇలా షాక్ ఇచ్చారని తెగ ఇదై పోతున్నారంట. అయితే అలా సెల్ఫ్ మేనేజ్‌మెంట్ చూసుకున్న నేతలు మాత్రం ఐదేళ్ళు తమకు పట్టించుకోలేదు కాబట్టే కొంత సైడ్ వేశామని.. ఇప్పుడు గెలిపిస్తే మరో అయిదేళ్లు తమను పట్టించుకోరు కాబట్టే అలా చేసినట్లు బహిరంగంగానే చేబుతున్నారు. మొత్తానికి అసమ్మతి నేతలు, అసంతృప్తితో ఉన్న నేతలు సరైన టైం చూసి ఇలా చేయడం. పార్టీకి ఎంత డ్యామేజ్ చేస్తుందో అని పార్టీ పెద్దలు లెక్కలు వేసుకోవాల్సి వస్తుందిప్పుడు.

## రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలి

**రాయచోటి తెలుగుదేశం పార్టీ**

**అభ్యర్థి రాంప్రసాద్ రెడ్డి**

బద్వేలు,చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రికావాలని,ఆయన పరిపాలనలోరాష్ట్రం సర్వతముఖాభివృద్ధిచెందాలని రాయచోటి టిడిపి ఎమ్మెల్యేఅభ్యర్థిమండిపల్లె రాంప్రసాద్ రెడ్డి ప్రార్థనలు చేశారు. సోమవారంపాతరాయచోటి శ్రీహజరత్ జమాలుల్లా బాషా సాహెబ్ దర్గాలో మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రానున్న రోజుల్లోచంద్రబాబు ముఖ్యమంత్రిగా రాయచోటి, జమాలుల్లా బాషా సాహెబ్ దర్గాలో రాయచోటి టిడిపి అభ్యర్థి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి చదివింపులు నిర్వహించి దువా చేశారు.టిడిపిఅభ్యర్థిమండిపల్లి సందర్భంగా రాయచో టిలో, రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసి, స్వర్ణాంధ్ర సృష్టికర్త చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి బాషా సాహెబ్ స్వామిని కోరుకున్నా నని, చంద్రబాబు నాయు డు రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థంచానని తెలిపారు.

## కౌంటింగ్ సమయంలో చాలా జాగ్రత్తగా ఉండండి

**ఏజెంట్లకు బద్వేలు తెలుగుదేశం పార్టీ యువనేత**

**రితేష్ కుమార్ రెడ్డి సూచన**

**రాష్ట్రంలో కూటమి గెలవబోతోంది**

బద్వేలు,ఓట్ల కౌంటింగ్ సమయంలో చాలా జాగ్రత్తగా ఉండండి రాష్ట్రంలో కూటమి గెలవ పోతున్నట్లు బద్వేలు తెలుగుదేశం పార్టీ యువ నేత రితేష్ కుమార్ రెడ్డి సూచించారు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం అయ్యారు బద్వేలు పట్టణ పార్టీ అధ్యక్షుడు గుర్రంపాటి వెంగళరెడ్డి అట్లూరు మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డి మాజీ జడ్పిటిసి సభ్యుడు భూపాల్ రెడ్డి పార్టీ నాయకులు సుబ్బారెడ్డి బిగ్ బాస్ న్యాయవాది ఏం నరసింహులు బార్ సంగం మాజీ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది ప్రసాద్ ఇంకా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు ఈ సందర్భంగా రితేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పూర్తిస్థాయి ఫలితాలు వచ్చేవరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు డిక్లరేషన్ ఫామ్ తీసుకున్న తర్వాతే కౌంటింగ్ గది నుంచి బయటికి రండి అనుమానాలు ఉంటే రీకౌంటింగ్ కోరండి వైకాపా వారు అక్రమాలకు దాడులకు పాల్పడవచ్చు ఎగ్జిట్ పోల్స్ అన్ని ఎన్ డి ఏ వైపే ఉన్నాయి గెలుపు మనదేనిఆయన ధీమా వ్యక్తం చేశారు కౌంటింగ్ పక్రియ ముగిసే వరకు ఎంతో అప్రమత్తంగా ఉండాలని కోరారు బద్వేలు నియోజవర్గం ఓట్ల లెక్కింపు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు 272 పోలింగ్ కేంద్రాల్లోని ఓట్లను 20రౌండ్లలో లెక్కిస్తారు ఒక గదిలో అసెంబ్లీ మరో గదిలో పార్లమెంటు ఓట్లను లెక్కిస్తారని ఆయన తెలిపారు అసెంబ్లీ ఓట్లను లెక్కించేందుకు 14 టేబుల్లు ఏర్పాటు చేశారు పోలింగ్ రోజు 84,491 మంది పురుషులు 88,167 మంది మహిళలు ఓట్లు వేశారు ఇతరులు ఇద్దరు ఓట్లు వేశారు అలాగే 3000 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేశారు ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయన కోరారు బద్వేలు అసెంబ్లీకి ఎంతో కీలకమైన ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి బొజ్జ రోశయ్య గెలవబోతున్నారని రితేష్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు కౌంటింగ్ సమయంలో అనుసరించవలసిన విధానాలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు అభ్యర్థి ఏజెంట్లు సమయానికి కేంద్రం వద్దకు చేరుకోవాలని చెప్పారు స్ట్రాంగ్‌రూముల నుంచి ఈవీఎంలు తీసుకువచ్చే సమయంలో ప్రధాన శీలన్ని సరిగా ఉన్నాయోలేదో చూసుకోవాలని ఏజెంట్లకు ఆయన మరీ మరీ చెప్పారు కేంద్రంలో రాష్ట్రంలో ఎన్ డి ఏ కూటమి అధికారంలోకి వస్తున్నట్లు అన్ని సర్వే సంస్థలు చెప్పిన విషయాన్ని రితేష్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు

## క్రికెట్ మించి బెట్టింగ్స్

తిరుపతి, జూన్ 3, నిన్నటి వరకు క్రికెట్ సాగింది... నేడు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎన్నికల ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. వీటిని అందరూ చూసారు.. మరి వీటిని ఆసరాగా చేసుకుని బెట్టింగ్ లకు తెర తీశారు పంటర్లు. దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ లో జరిగిన ఎన్నికలకు సంబంధించి ఫలితాలు ఎప్పుడు విడుదలవుతాయి అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. జూన్ 4వ తేదీన విలువడివి ఫలితాలకు సంబంధించి వందల కోట్లు ఖర్చుపెట్టిన అభ్యర్థులు ఎవరు గెలుస్తారో ఎవరు ముగుసుతారో ప్రజల నిర్ణయం ఎటు వైపు అనేది తేలిపోయింది. రాజకీయ నాయకులు కావడంతో నాయకులు, పార్టీలో పెట్టిన ఖర్చు సంగతి అటు ఉంచితే... వీటిపై ఆధారపడి బెట్టింగ్ రాయుళ్లు చేస్తున్న పందాలు ఎన్నికల ఖర్చు మంచి పోతుంది.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు ముఖ్య నాయకులు ఉన్నారు. కుప్పం, పుంగనూరు, నగరి, చంద్రగిరి, చిత్తూరు, తిరుపతి ఇలా 14 నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్ లు జోరుగా సాగుతున్నాయి. ఈ బెట్టింగ్ ల వెనుక రాజకీయ నాయకులు, వారి బంధువులు కీలకంగా ఉన్నారని సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఏ పార్టీ ఎన్ని సీట్లు సాధిస్తుందనేది అందరికి ఉన్న ఆసక్తి. దీని పైన భారీగా బెట్టింగ్ లు సాగుతున్నాయి. కొన్ని స్థానాల పైన అయితే 1కి 5 రెట్లు అధికంగా కూడా బెట్టింగ్ సాగుతుంది. మరో వైపు బెట్టింగ్ వేస్తున్న వారిలో అధిక శాతం పార్టీల పైన ప్రభుత్వం ఏర్పాటు చేసే నాయకులపై వేస్తున్నారు. నుంచి ఎంత మెజారిటీ ఇలా వివిధ రకాల బెట్టింగ్ లు సాగుతున్నాయి. ఐపీఎల్ సీజన్ ప్రారంభం నుంచి ముగింపు స్పష్టమవుతోంది. బెట్టింగ్ లు జరుగుతున్నాయని... ఎవరు నిర్వహిస్తారో కూడా తెలుసు... ఆన్ లైన్ విధానం లో జరుగుతున్న బెట్టింగ్ లను ఎలా కాని పెట్టాలో తెలుసు కాని ఇప్పటి వరకు పోలీస్ శాఖ ఎక్కడా బెట్టింగ్ ల పై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

## వైసీపీలో అంతర్మధనం...

నెల్లూరు, 3, వైసీపీది సేమ్ టిడిపి పరిస్థితి. గత ఎన్నికల్లో అధికార పార్టీగా ఉన్న టిడిపి కోరుకున్నట్టు ఒక్క పని కూడా జరగలేదు. ఎలక్షన్ క్యాంపెయిన్ మొత్తం వైసిపి చెప్పినట్టే జరిగింది.అధికారుల మార్పు ఆ పార్టీ సిఫారసుల మేరకే జరిగింది.పోలింగ్ కూడా వారికి లబ్ధి చేకూరేలా నిర్వహించారు. చంద్రబాబుపై కేంద్ర పెద్దల ఆగ్రహాన్ని నాడు జగన్ సద్వినియోగం చేసుకున్నారు. అయితే ఇప్పుడు అదే పరిస్థితి జగన్ కు ఎదురయింది. చివరకు ఈసీ నిర్ణయాలపై కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ఒక్కటంటే ఒక్కటి కూడా అనుకూలంగా లేదు.చివరకు పోలింగ్ నాడు సహకరిస్తారనుకున్న యంత్రాంగం ఎదురు తిరిగింది.ఎంత దాకా పరిస్థితి వచ్చిందంటే.. నిన్నటి వరకు పోలీస్ శాఖకు ఆదేశాలు ఇచ్చిన సజ్జల రామకృష్ణారెడ్డి లాంటి వారిపై.. అదే పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసినంత దాకా. దీంతో వైసీపీ నేతలకు మైండ్ బ్లాక్ అవుతోంది. రేపు అన్నది ఒకటి ఉంది అని గుర్తించుకోండి.. అని అధికారులకు హెచ్చరించే దాకా పరిస్థితి వచ్చింది.గత ఎన్నికల సమయంలో ఒక్క అధికారి కూడా టిడిపి మాట వినలేదు.ఎన్ని రకాల ఇబ్బందులు పెట్టారో అంతలా పెట్టారు.ఇప్పుడు అదే అధికారులు వైసీపీకి కూడా ఎదురు తిరిగారు. కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. నెల్లూరు జిల్లా కలెక్టర్ తమకు సహకరించలేదని.. కూటమికి అనుకూలంగా పనిచేసారని సాక్షాత్ ఆ జిల్లా మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్షన్ కమిషన్ మొత్తం టిడిపి కూటమికి బాగా సహకరించిందని నరసాపురం వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ తెగ బాధ పడిపోయారు. మంత్రి అంబటి రాంబాబు అయితే తన నియోజకవర్గంలో రెండు చోట్ల రీపోలింగ్ నిర్వహించాలని ఏకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పేర్ని నాని అయితే తెగ బాధ పడిపోయారు. తమ ఫిర్యాదులను పట్టించుకోని ఎలక్షన్ కమిషన్.. టిడిపి కూటమి నేతలు ఇలా అడిగారో లేదో యాక్షన్ లోకి దిగుతున్నారని వాపోయారు.ఏపీలో రెండు ఘటనలు వైసీపీకి కంటిమీద కునుకు లేకుండా చేశాయి.ఒకటి ఏబీ వెంకటేశ్వరరావుకు పోస్టింగ్,రెండు సజ్జల రామకృష్ణారెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు. ఈ రెండు పరిణామాలతో వైసిపికి తత్వం బోధపడింది. పూర్తిస్థాయి క్లారిటీ వచ్చింది. అధికారుల్లో మార్పు, న్యాయస్థానాల తీర్పులు చూసి మైండ్ బ్లాక్ అవుతోంది. ఎక్కడో తేడా కొడుతోంది అన్న అనుమానాలు బలపడుతున్నాయి. కేవలం నాయకత్వం మేకపోతు గాంభీర్యం చూపిస్తోందని.. సగటు వైసిపి అభిమాని ఒక నిర్ణయానికి వచ్చారు. అయితే సజ్జలపై కేసు నేపథ్యంలో.. రేపు అంటూ ఒకటి ఉంటుందని పేర్ని నాని అధికారులను హెచ్చరించారు. అయితే ఆయనకు తెలియంది కాదు.. రేపు అనేది ఒక క్లారిటీ రావడం వల్లే అధికారుల్లో మార్పు వచ్చిందన్న విషయం ఆయన తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మొత్తానికైతే వరుసగా జరుగుతున్న పరిణామాలు వైసీపీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల చెల్లుబాటు విషయంలో న్యాయస్థానం ఎటువంటి తీర్పు ఇస్తుందో చూడాలి.

## కడప లో తేడా కొట్టినట్టు.. ఉందే

కడప,జూన్ 3,ఎగ్జిట్ పోల్‌లో ఆంధ్రప్రదేశ్‌లో కూటమి గాలి వీస్తోందని వెల్లడయింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే బీజేపీ అగ్రనేతలు ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు మొత్తం ఇరవై ఐదు సీట్లను స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కూడా అదే చెప్పారు. అయితే చాలా మంది కడప లోక్ సభ సీటులో వైఎస్ఆర్‌సీపీని ఎవరూ ఓడించలేరని భావిస్తున్నారు. కానీ ఏబీపీ–సీఓటర్ ఎగ్జిట్ లో భిన్నమైన ఫలితం వస్తోంది. కూటమికి 21 నుంచి 25 సీట్లు వస్తాయని ఏబీపీ – సీఓటర్ ఎగ్జిట్ పోల్ తేల్చింది. వైఎస్ఆర్‌సీపీ కి సున్నా నుంచి నాలుగు సీట్లలో చాన్స్ ఉంది. అంటే నాలుగు సీట్లలో మాత్రమే గట్టి పోటీ ఇస్తోంది.ఆ నాలుగు సీట్లలో కడప నియోజకవర్గం కూడా ఉండి ఉండవచ్చు. కడప ఇలా రిస్క్ లో పడటానికి కారణం ఎవరో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు షర్మిల అని. వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసురాలిగా అడుగు పెట్టిన ఆమె.. ఏపీ కాంగ్రెస్ చీఫ్ గా బాధ్యతలు తీసుకున్నారు. విస్తృతంగా పర్యటించారు. కడప లోక్ సభకు పోటీ చేశారు. కొంగు చాపి న్యాయం చేయాలని ప్రజల్ని అడిగి సెంటిమెంట్ రాజకీయాలు చేశారు. షర్మిల దూకుడుగా చేసిన రాజకీయాల వల్ల కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంక్ 3.3 శాతానికి చేరుకుంటుందని స్పష్టమయింది. గత ఎన్నికల్లో ఇది ఒక్క శాతం కూడా లేదు. కాంగ్రెస్‌కు పెరిగిన ప్రతి ఒక్క ఓటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీదే అవుతుంది. ఎందుకంటే వైసీపీ ఓటు బ్యాంక్ మొత్తం కాంగ్రెస్ పార్టీదే. దళితులు, ముస్లింలు , గిరిజనుల్లో ఈ సారి కొంత కాంగ్రెస్ వైపు మళ్లినట్లుగా కనిపిస్తోంది. ఇది వైసీపీని భారీగా దెబ్బతీస్తున్నట్లుగా చెబుతున్నారు. షర్మిల భర్త అనిల్ కుమార్ కు క్రైస్తవ వర్గాల్లో ఉన్న నెట్ వర్క్ కూడా ఇందుకు ఉపయోగపడిందని అనుకోవచ్చు.కడప లోక్ సభ నియోజకవర్గంలో షర్మిల కూడా గట్టి పోటీ ఇచ్చారు. ఆమెకు ఆ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో భారీగా ఓట్లు పోలయ్యాయని ఎగ్జిట్ పోల్ అంచనాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. షర్మిల గెలవలేకపోవచ్చు కానీ అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఎక్కువగా నష్టం చేయడం ఖాయంగా కనిపిస్తోంది. మరో వైపు ఏపీలో ఎన్నికల ఫలితాలపై గతంలో ఎన్నడూ లేనంత ఉత్కంఠ నెలకొంది. నువ్వా నేనా అన్నట్టుగా నేతలు పోటీ పడటమే ఇందుకు ప్రధాన కారణం. పోలింగ్ ముగిసిన వెంటనే విజేతలు ఎవరనే దానిపై మొదలైన సస్పెన్స్.. ఇంకా కొనసాగుతూనే ఉంది. ఎగ్జిట్ పోల్స్‌తో దీనిపై ఓ స్పష్టత వస్తుందని భావించినా.. అందులోనూ సేమ్ సీన్ కనిపించడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. పలు ఎగ్జిట్ పోల్స్ వైసీపీదే విజయం అంటుంటే.. మరికొన్ని మాత్రం ఏపీలో కింగ్ కూటమే అని అంచనా వేశాయి. దీంతో గత 20 రోజులుగా ఫలితాలపై కొనసాగుతున్న ఉత్కంఠ మరింత పెరిగింది.వాస్తవానికి ఎగ్జిట్ పోల్స్‌తో వాస్తవ ఫలితాలు అంచనా వేయొచ్చని విశ్లేషకులతో పాటు ప్రధాన పార్టీల నాయకులు భావించారు. అయితే క్లారిటీ ఇవ్వాల్సిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నేతలను మరింత టెన్షన్ పెడుతున్నాయి. భిన్నమైన అంచనాలు ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్ రాజకీయ పార్టీ శ్రేణులను కన్ఫ్యూజన్‌లో పడేశాయి. తమకు అనుకూలంగా ఉన్న ఎగ్జిట్ పోల్స్ నిజమవుతాయని.. ప్రత్యర్థులకు అనుకూలంగా ఉన్న ఎగ్జిట్ పోల్స్ ఫేక్ అంటూ నేతలు విమర్శలు గుప్పించారు.ఎగ్జిట్‌పోల్స్ గందరగోళంగా ఉన్నాయి.. లోకల్ సర్వేలు తమకు పాజిటివ్‌గా ఉన్నాయంటోంది వైసీపీ. మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ తమకే అనుకూలంగా ఉన్నాయి.. అధికారం తమదే అని కూటమి పార్టీల నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తమకు అనుకూలంగా ఉన్నాయని ఎవరికి వారు ప్రకటించుకుంటున్నారు. అందుకు కారణాలు కూడా విశ్లేషిస్తున్నారు. మొత్తంగా ఎగ్జిట్ పోల్స్‌తో ఓ అంచనా వస్తుందని భావించిన నేతలు, పార్టీలకు మరింత టెన్షన్ పెరిగింది.

## రాజకీయ విషయాలకే ప్రాధాన్యం

తిరుపతి, జూన్ 3,ఏపీ ఎన్నికల ఫలితాలకు కౌంట్ డౌన్ కొనసాగుతోంది. జూన్ 4న ఫలితాలు రానున్నాయి. ఎక్కడ చూసినా ఇదే చర్చ నడుస్తోంది. ఏ ఇద్దరు కలిసినా వ్యక్తిగత విషయాలు కంటే.. రాజకీయ అంశాలకే ప్రాధాన్యత దక్కుతుంది. ఎవరు గెలుస్తారు?ఎవరు ఓడిపోతారు? గెలిస్తే ఎంత మెజారిటీ వస్తుంది? ఓడిపోతే ఎంత తేడాతో? ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఏ నోట చెప్పినా ఇదే మాట. మొత్తానికైతే జగన్, చంద్రబాబు, పవన్ లకు మించి సామాన్య జనాల్లోనే ఎన్నికల కౌంటింగ్ పై అంచనాలు ఉన్నాయి. చాలామంది టెన్షన్ టెన్షన్ తో గడుపుతున్నారు.సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న అతి అంతా ఇంతా కాదు. అప్పుడే పలానా ఎమ్మెల్యే గారి తాలూకా అంటూ ద్విచక్ర వాహనాల నంబర్ ప్లేట్లకు అతికిస్తున్నారు. కార్లకు సైతం స్టిక్కర్లు దర్శనమిస్తున్నాయి. వైసీపీ నేతలు అయితే జూన్ 9న జగన్ విశాఖలో ప్రమాణ స్వీకారం చేస్తారని కూడా చెప్పుకొస్తున్నారు. ఆరోజు వైజాగ్ లో హోటల్లు, రిసార్టు బుక్ అయిపోయాయని కూడా చెబుతున్నారు. రైళ్లు, విమానాల టిక్కెట్లు కూడా ఖాళీ లేదని ప్రచారం చేస్తున్నారు. మరో అడుగు ముందుకేసి జగన్ ప్రమాణస్వీకారం రోజు వైసీపీ శ్రేణులకు ఫుడ్ మెనూ ఇది అంటూ.. ఒక జాబితా సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతోంది. ఇక బెట్టింగుల గురించి చెప్పనవసరం లేదు. ఆఫ్లైన్ నుంచి ఆన్లైన్ వరకు బెట్టింగులు కొనసాగుతూనే ఉన్నాయి.రాజకీయాలపై విపరీతంగా మోజు ఉన్నవారు, పార్టీలపై పిచ్చి ఉన్నవారు ఒక రకమైన టెన్షన్ వాతావరణంతో గడుపుతున్నారు. మందుబాబులు అయితే తెగ తాగేస్తున్నారు. ప్రతిక్షణం కౌంటింగ్ గురించి ఆలోచించే వారు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల టెన్షన్ గురించి సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అవుతోంది. రెండు జట్ల మధ్య కబాడీ మ్యాచ్ జరుగుతుంటే..జట్లలో ఉండే క్రీడాకారుల కంటే.. ఆ ప్రాంగణంలో ఉన్న ప్రేక్షకులు టెన్షన్ తో గడుపుతుంటారు. కబాడీ క్రీడకు సంబంధించి ఏవేవో సూచనలు ఇచ్చి క్రీడాకారులను ఉత్సాహపరుస్తుంటారు. ఇప్పుడు అదే వీడియోను జతపరుస్తూ.. ఎన్నికల్లో పోటీ చేసిన వారి కంటే.. పార్టీల అధినేతల కంటే వీరికే టెన్షన్ అంటూ మిమ్స్ పెడుతూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అంతా ఇంతా కాదు. ప్రజల్లో ఆ తరహా టెన్షన్ ఉందని చెప్పేందుకు ఈ వీడియో ది బెస్ట్ ఉదాహరణగా మిగిలింది.

## అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ట్రాఫిక్ ఆంక్షలు

**అమలాపురం నుండి కాకినాడ వెళ్ళే**

**వాహనాలకు దారి మళ్లింపు**

కోనసీమ,ఎన్నికల కౌంటింగ్ సెంటర్ శ్రీనివాస ఇంజనీరింగ్ కాలేజ్ నేషనల్ హైవే( 216) ఆనుకుని ఉండడంతో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కాకినాడ నుండి అమలాపురం వైపు వెళ్ళు మోటార్ సైకిళ్ళు, ఆటోలు మరియు కార్లు కొండాలమ్మ చింత బైపాస్ వయా ముక్తేశ్వరం మీదుగా అమలాపురం దారి మళ్లించారు. అమలాపురం నుండి కాకినాడ వెళ్లే వాహనాలు అనాతవరం, మాగం, కాపచింతలపూడి మీదుగా బైపాస్ కొండాలమ్మ చింత మీదుగా అనాతవరం, చెయ్యేరు వాహనదారులు మహిపాల చెరువు, పోతుకుర్రు, కాప కొండాలమ్మ చింత బైపాస్ మీదుగా కాకినాడ మళ్లించారు. కాకినాడ నుండి అమలాపురం.. అమలాపురం నుండి కాకినాడ వెళ్ళే భారీ వాహనములు రేపు ఉదయం నుండి సాయంత్రం కౌంటింగ్ అయ్యేవరకు నిలిపివేస్తారు. కాకినాడ నుండి వచ్చే భారీ వాహనాలు అన్నంపల్లి టోల్ గేట్ వద్ద, అమలాపురం నుండి కాకినాడ వెళ్లే భారీ వాహనములు భట్నవిల్లి జ జంక్షన్ వద్ద ఉదయం 04.30గంటల నుండి కౌంటింగ్ అయ్యేవరకు నిలిపివేస్తారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దు ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేసారు. అస్వాత్మక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో పోలీసలు పర్యవేక్షిస్తున్నారు.

## పిన్నెల్లికి షాక్

న్యూఢిల్లీ, జూన్ 3మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. పిన్నెల్లిపై సుప్రీం కోర్టు ఆంక్షలు విధించింది. కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లొద్దని ఆదేశాలు జారీ చేసింది. ఈవీఎం ధ్వంసం చేసిన వీడియోను పిటిషనర్ తరపు న్యాయవాది ప్రదర్శించారు. దీనిపై మీ సమాధానం ఏంటని పిన్నెల్లి తరపున న్యాయవాదులను సుప్రీం కోర్టు ప్రశ్నించింది. పిన్నెల్లికి ముందస్తు బెయిల్ మంజూరు చేయడంపై ఆగ్రహం చేసింది. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లికి తదుపరి విచారణలో అన్ని అంశాలను దృష్టి పెట్టుకుని హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వాలని హెచ్చరించింది. తర్వాతి విచారణలో పూర్తి స్థాయి విచారణ చేస్తామని తెలిపింది.

# సజావుగా సప్లిమెంటరీ పరీక్షలు

## జిల్లా విద్యాశాఖ అధికారి కె. సుధాకర్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 03-సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబడిన సార్వత్రిక విద్యాపీఠం, పదవతరగతి మరియు ఇంటర్మీడి యట్ సప్లిమెంటరీ పరీక్షలలో భాగంగా హిందీ, జీవశాస్త్రం మరియు వాణిజ్య శాస్త్రం పరీక్షలు ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు నిర్వహించబడినవి అని జిల్లా విద్యాశాఖ అధికారి కె. సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల జిల్లాలో 5 పరీక్షా కేంద్రాలలో 169 విద్యార్థులకు గాను 154 విద్యార్థులు పరీక్షకు హాజరుకావటం జరిగిందన్నారు. 15 మంది విద్యార్థులు గైర్హాజరు కావడం జరిగినది . పదవతరగతి హిందీ పరీక్షకు 6 మంది విద్యార్థులకు గాను 5 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. ఒక విద్యార్థి గైర్హాజరు కావడం జరిగినది. ఇంటర్ నందు 163 మంది గాను 154 విద్యార్థులు పరీక్షకు హాజరుకావటం జరిగిందన్నారు. 9 మంది విద్యార్థులు గైర్హాజరు కావడం జరిగినది. జిల్లా విద్యా శాఖాధికారి కె.సుధాకర రెడ్డి రెండు పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 4 పరీక్షాకేంద్రాలను సందర్శించడం జరిగింది . అన్ని పరీక్షా కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి సజావుగా పరీక్షలు నిర్వహించడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి కె. సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు

# కౌంటింగ్ సందర్భంగా నిషేధాజ్ఞలు విధింపు

## జూన్ 6 వరకు అనుమతులు లేవు

## పట్టణ సీఐ రమేష్ బాబు



ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 03 విభారె న్యూస్ :-ఈనెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జూన్ 4 నుండి ఆరవ తేదీ వరకు నిషేధాజ్ఞలు విధించినట్లు పట్టణ సీఐ రమేష్ బాబు తెలిపారు. సోమవారం పట్టణ ఎస్సై వెంకట్ రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళవారం ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. జూన్ 3 రాత్రి నుండి నాలుగు రాత్రి వరకు అన్ని హోటల్లు, లాడ్జిలు, రెస్టారెంట్లు మూసివేయాలన్నారు. ఇతర ప్రాంతాలకు చెందినవారు ఆళ్లగడ్డలో ఉండకూడదన్నారు. బహిరంగ ప్రదేశాలలో పెద్దపెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేయడం, గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఇళ్లలోనే ఉండాలన్నారు. ఎవరైనా రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం గాని ..బాణాసంచా కాల్చడం గాని చేయరాదన్నారు.. జూన్ 6వ తేదీ వరకు ఎటువంటి ఉత్సవాలు గాని సంబరాలు గాని చేయుటకు పర్మిషన్ లేదన్నారు. పోలీసుల ఉత్తర్వులు పాటించకుండా ఎవరు ఎలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కౌంటింగ్ కు భారీ బందోబస్తు

హిందూపురం,సత్య సాయి జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు, ఒక పార్లమెంట్ స్థానానికి కౌంటింగ్ కు కట్టుదిట్టమైన భద్రత మధ్య ఏర్పాట్లను పూర్తి చేశారు అధికారులు. హిందూపురం మండలం బిట్ కళాశాలలో హిందూపురం, పెనుకొండ, మడకశిర, కదిరి అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ జరుగుతుంది. పుట్టపర్తి ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ లేపాక్షి సమీపంలోని గురుకుల పాఠశాలలోఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది.కౌంటింగ్ ప్రాంతాలలో నాలుగంచెల భద్రత ఏర్పాట్లు చేశారు పోలీసు అధికారులు. ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహణ లక్ష్యంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.నిరంతరం డ్రోన్, సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సందర్భంగా 2, ఎస్పీలు, ,3, ఏఎస్పీలు, 10, డీఎస్పీలు 42, సిఐలు, 68, ఎస్ఐలు, 326, ఏఎస్ఐలు, ఐదు వందల మంది పోలీసులు, మూడు వందల.మంది, హోంగార్డులు, 60మంది మహిళా పోలీసులు, తోపాటు 120 ,మంది ఏఆర్ కానిస్టేబులు, 80, మంది ఏపీఎస్పీ పోలీసుల తోపాటు జిల్లావ్యాప్తంగా 110, (క్యూఆర్టీ టీములు) కేంద్ర సాయుధ బలగాలు , గ్రేహౌండ్స్ బలగాలు, ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ మాధవ రెడ్డి తెలిపారు. లేపాక్షి గురుకుల పాఠశాల, బిట్స్ కళాశాలలోకి వెళ్లొచ్చేందుకు ఎంట్రీ ..ఎగ్జిట్ మినహాయించి మార్గాలేవి లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు ఎస్పీ. ఆయా రాజకీయ పార్టీల నాయకుల అనుచరులు అల్లర్లకు దిగితే సంబంధిత పార్టీ అభ్యర్థులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

# ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలి

## సాధారణ పరిశీలకులు జాఫర్, మీర్ తారిఖ్ అలీ






విభారే న్యూస్ కర్నూలు, జూన్, 03,జూన్ 4వ తేదిన జరగనున్న కౌంటింగ్ రోజున ఎన్నికల నియమ నిబంధనలు తూచ తప్పకుండా పాటిస్తూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు జాఫర్, మీర్ తారిఖ్ అలీ మైక్రో అబ్జర్వర్స్ ను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ నిర్వహణపై జనరల్ అబ్జర్వర్స్ సమక్షంలో మైక్రో అబ్జర్వర్స్ కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు జాఫర్, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు మీర్ తారిఖ్ అలీ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా ఉండేందుకు మైక్రో అబ్జర్వర్స్ గా గెజిటెడ్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఒకేసారి అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో జనరల్ అబ్జర్వర్ ఉండడం సాధ్యం కాదని, వారి ప్రతినిధిగా మైక్రో అబ్జర్వర్స్ ను నియమించడం జరిగిందన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి ద్వారా అందజేసిన మెటీరియల్ ను చదివి అవగాహన కల్పించుకోవాలన్నారు. ముఖ్యంగా కౌంటింగ్ కేంద్రాల్లో జరుగుతున్న కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా జనరల్ అబ్జర్వర్స్ దృష్టికి తీసుకొని వస్తూ ఇబ్బంది లేకుండా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది నమోదు చేసుకుంటున్న వివరాలను పరిశీలిస్తూ మీరు కూడా నోట్ చేసుకుంటూ సదరు వివరాలను క్రాస్ చెక్ చేసుకుంటూ ఉండాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జూన్ 2వ తేదిన కౌంటింగ్ అసిస్టెంట్స్, సూపర్వైజర్స్, మైక్రో అబ్జర్వర్స్ ర్యాండమైజేషన్ చేసి వారిని నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలకు కేటాయించడం జరిగిందన్నారు. అందులో ఈవిఎం టేబుల్స్ కు ఒక మైక్రో అబ్జర్వర్, పోస్టల్ బ్యాలెట్ టేబుల్ పై ఒక మైక్రో అబ్జర్వర్ ఉండడంతో పాటు మిగతా టేబుల్స్ పై జనరల్ అబ్జర్వర్స్ ప్రతినిధులుగా కొంతమంది మైక్రో అబ్జర్వర్స్ ఉంటారన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల నియమ నిబంధనలు మేరకు విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని పూర్తి స్థాయిలో వెరిఫై చేస్తూ ఉండాలన్నారు. కౌంటింగ్ కు సంబంధించి మెటీరియల్ పై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండడంతో పాటు కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు గాను గుర్తింపు కార్డులను కలెక్టరేట్ నుండి తీసుకోవాలన్నారు. అదే విధంగా రేపు ఉ.5.గం.లకు కలెక్టరేట్ లో సిబ్బంది రిపోర్ట్ చేయాలని వారిని బస్సుల ద్వారా తరలించి అక్కడే అల్పాహారం అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఈవిఎం కౌంటింగ్, మైక్రో అబ్జర్వర్స్ విధులపై ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి సిద్దలింగమూర్తి, పోస్టల్ బ్యాలెట్ పై నోడల్ అధికారి సోమశేఖర్ రెడ్డి అవగాహన కల్పిస్తూ డమ్మీ పోస్టల్ బ్యాలెట్ లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ మైక్రో అబ్జర్వర్స్ కు అవగాహన కల్పించారు. సమావేశంలో డిఆర్ఓ మధుసూదన్ రావు, ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారులు సోమశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్, సిద్దలింగమూర్తి, మైక్రో అబ్జర్వర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు సిబ్బందికి రెండవ విడత ర్యాండ మైజేషన్ పూర్తి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 03-సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ కోసం రెండవ విడత ర్యాండమైజేషన్ ద్వారా 746 మంది కౌంటింగ్ సిబ్బందిని ఆరు నియోజకవర్గాలను కేటాయించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించడానికి ఎలక్షన్ కమిషన్ ద్వారా జిల్లాకు కేటాయించబడిన అబ్జర్వర్ల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ సూచించిన ప్రత్యేక సాఫ్ట్ వేర్ ద్వారా మే 24వ తేదీ కౌంటింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామన్నారు. సోమవారం రెండో విడత రాండమైజేషన్ ద్వారా 120 శాతం రిజర్వుతో కలిపి మొత్తం 746 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. ఇందులో 221 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 278 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 247 మంది మైక్రో అబ్జర్వర్లను ఆరు నియోజకవర్గాలను కేటాయించామని కలెక్టర్ తెలిపారు. రెండో విడత రాండమైజేషన్ నియమించిన సిబ్బందికి కూడా వెంటనే కౌంటింగ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారుజూన్ 4వ తేదీ కౌంటింగ్ రోజు ఉదయం 5 గంటలకు 3వ విడత ర్యాండమైజేషన్ నిర్వహించి ఏ టేబుల్ లో కౌంటింగ్ నిర్వహించాలో తెలపడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, 134 - ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ అబ్జర్వర్ అన్నవి దినేష్ కుమార్, 135 - శ్రీశైలం అబ్జర్వర్ భగవత్ కిషోర్ మిశ్రా, 136 - నందికొట్కూర్ అబ్జర్వర్ అభిజిత్ ముఖర్జీ, 139 - నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ అబ్జర్వర్ రాహుల్ సింగ్, 140 - బనగానపల్లె అబ్జర్వర్ డా. వేద్ ప్రకాష్ మిశ్రా, 141 - డోన్ అసెంబ్లీ నియోజకవర్గ అబ్జర్వర్ అమిత్ కుమార్, సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఎన్ఐసి డిఐఓ అలెన్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు

# సైకిల్ తొక్కండి ఆరోగ్యంగా ఉండండి...





విభారే న్యూస్ మా ప్రతినిధి:-జూన్ 3 ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా40 సంవత్సరాలు సైకిల్ తొక్కుతూ ఆరోగ్యవంతంగా ఉన్నాను అని సామాజిక కార్యకర్త ఏ ఈ నాగరాజు గౌడ్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వలన షుగరు బీపీ గ్యాస్ ట్రబుల్ ఇటువంటి వ్యాధులు రావు దానికి తోడు మానసిక వికాసము శారీరిక ఆనందము కలుగుతాయి పెట్రోల్ వాడడం వలన పెట్రోల్ కల్తీ లో భాగంగా వాతావరణ కాలుష్యం చెడిపోతుంది అదే విధంగా పెట్రోల్ కొరకు అక్రమ మార్గంలో ప్రయాణించడం జరుగుతుంది. ఇతరులను బ్లాక్ మెయిల్ చేసి డబ్బు సంపాదించేది పడుతుంది అదే కాకుండా సైకిల్ మోటార్లు ఎవరికైనా ఇవ్వడం వలన వారు యాక్సిడెంట్ చేస్తే ఆ కేసు బండి యజమాని పై పడుతుంది సైకిల్ మోటార్ తీసుకొని పోయి పెట్రోల్ అయిపోగొట్టుకొని తీసుకుని వచ్చినవారితో నిష్ఠూరం కాలేము ఇంటి ముందర స్థలం లేనప్పుడు సైకిల్ మోటార్ బయట పెట్టడం వలన వీధి నందు ఆటో వారికి ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది 1980లో 250 రూపాయలకు పాత సైకిల్ కొనుగోలు చేశాను అప్పటినుండి ఇప్పటివరకు దాదాపుగా నాతోపాటు నా సైకిలు ప్రయాణం చేసింది నేను ఎన్ని జన్మలెత్తినా నా సైకిల్ రుణము తీర్చుకోలేను అదేవిధంగా సైకిల్ షాప్ ఓనర్ కొత్తపల్లి భాష పూల అంగళ్ళ దగ్గర సైకిల్ షాప్ ఉన్నది ఆ సైకిల్ షాప్ ఓనరు నా సైకిల్ కి ఎప్పుడు రిపేర్ అయినా ఎటువంటి డబ్బులు తీసుకోకుండా నాకు సహాయం చేస్తున్నాడు నేను చేసే సామాజిక సేవకులు ఆ కొత్తపల్లి భాషకు కూడా వస్తుంది కావున ఆరోగ్యమునకు శారీరిక శ్రమకు సైకిల్ ఎంతో ఉపయోగపడుతుంది నంద్యాల కర్నూల్ గేట్ వేసినప్పుడు సైకిల్ మోటార్ వాహనదారులు గేటు కింద నుంచి పోవడానికి ఎంతో వ్యయ ప్రయాసలు పడుతుంటారు అయితే నాకు మాత్రం ఏ మాత్రం ఇబ్బంది లేకుండా గేటు దాటి బయటకు పోతాను వారిని చూసినప్పుడల్లా నేను చాలా అదృష్టవం అని అనుకుంటాను కావున దయచేసి సైకిల్ ను వాడండి వాతావరణ కాలుష్యాన్ని పరిరక్షించండి అని ఆయన అన్నారు

# గ్రామాలలో అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదు

## పత్తికొండ రూరల్ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి

## తుగ్గలి ఎస్సై మల్లికార్జున

తుగ్గలి, సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదని పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి,తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున లు తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం రోజున వారు మాట్లాడుతూ కర్నూల్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, పత్తికొండ డిఎస్పి సూచనలను అనుసరించి పత్తికొండ రూరల్ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి మరియు తుగ్గలి మండల ఎస్సై బి.మల్లికార్జున పర్యవేక్షణలో జూన్ 6వ తేదీ వరకు 144 సెక్షన్ మరియు పోలీస్ శాఖ పరమైన 30 సెక్షన్లు కఠినంగా అమలులో ఉంటాయని, కావున తుగ్గలి మండలంలోని ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తూ అల్లర్లు సృష్టించే వారిపై ఉక్కు పాదం మోపి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. సోమవారం రోజున పత్తికొండ రూరల్ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి,తుగ్గలి మండల ఎస్సై మల్లికార్జున ఆధ్వర్యంలో తుగ్గలి పోలీసులు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, కానీ స్టేబుల్ ఆంజనేయులు,లక్ష్మణ్, హోమ్ గార్డ్ రంగస్వామి తుగ్గలి మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి వారు ప్రజలకు అవగాహన కల్పించారు.కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో కౌంటింగ్ మరియు ఆ తర్వాత జరిగే పరిణామాలపై ముందస్తుగా విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు పూర్తిగా నిషేధించిందని వారు తెలియజేశారు.ముఖ్యంగా ప్రజలు సోషల్ మీడియాలో మరియు వాట్సాప్ గ్రూపులలో రెచ్చగొట్టి పోస్టింగులు వీడియోలు ఫోటోలు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని వారు ప్రజలకు తెలియజేశారు.మండలంలోని వివిధ గ్రామాలలోని ప్రజల ప్రశాంత వాతావరణము ఉంచేందుకు,గ్రామాల్లో నేర చరిత్ర కలిగిన వారెవ్వరు గొడవలు అల్లర్లు సృష్టించరాదని హెచ్చరించడం జరిగిందన్నారు.అదేవిధంగా ముఖ్యంగా గ్రామాల్లోని ప్రజల భద్రత కొరకు ప్రత్యేక నిఘా పెట్టారని,పల్లె ప్రాంతాల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండి మంచి సహచర సోదరభావంతో ఉండాలని వారు ప్రజలకు తెలియజేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190